

- కేసీఆర్‌ను ఢీ కొట్టే దమ్ము ఎవ్వరికీ లేదు
- కష్టమొస్తే ఆదుకునే నాయకుడు పద్మారావు
- రోడ్ షోలో మంత్రి కేటీఆర్



మాట్లాడుతున్న పద్మారావు గౌడ్

అభివృద్ధే మా కులం..సంక్షేమమే మా మతం

అడ్డగుట్ట: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధే మా కులం.. ప్రజా సంక్షేమమే మా మతం అనుకుని బీఆర్‌ఎస్ ప్రభుత్వం ముందుకు సాగిందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సికింద్రాబాద్ బీఆర్ ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు మద్దతుగా శనివారం రాత్రి తుకారాంగేట్‌లోని రియోపాయింట్ హోటల్ సమీపంలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలో గత తొమ్మిదిన్నర సంవత్సరాలుగా పద్మారావుగౌడ్ సికింద్రాబాద్‌లో బ్రహ్మాండమైన అభివృద్ధి చేశారన్నారు. గడిచిన కాలంలో సికింద్రాబాద్‌లో డిగ్రీ కాలేజీ ఉండేది కాదని, ఇది వరకు పద్మారావుగౌడ్ మంత్రిగా ఉన్న సమయంలో సికింద్రాబాద్‌లో మొట్టమొదటి డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేసిన ఘనత పద్మారావుగౌడ్‌కే దక్కుతుందన్నారు. దశాబ్దాల నుంచి గతంలో పెద్ద పెద్ద వాళ్లు వచ్చి ఇక్కడ పని చేసినా కూడా వాళ్లతో కాని అభివృద్ధి పద్మారావుగౌడ్ చేసి చూపించారన్నారు. తుకారాం గేట్‌లో రూ. 72 కోట్లతో ఆర్‌యూబీ నిర్మాణం, సీతాఫల్‌మండిలోని కుట్టివెళ్లోడి ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రి చేయడం, మాణికేశ్వరీ నగర్‌లో కూడా వంద పడకల ఆస్పత్రి నిర్మాణం కోసం స్థలం కూడా కేటాయించుకున్నామన్నారు. అదే విధంగా అడ్డగుట్టలో ముప్పై పడకల ఆస్పత్రి కోసం రూ. 13 కోట్లు కేటాయించినట్లు, లాలాపేటలో రూ. 11 కోట్లతో ఆస్పత్రి నిర్మాణం, సీతాఫల్‌మండిలో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్, అడ్డగుట్ట, లాలాపేటలో కూడా ఫంక్షన్ హాళ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. తాగునీటి కోసం రూ. 32 కోట్లతో మారేడుపల్లి, శాంతినగర్, తార్నాకలో మంచినీళ్ల రిజర్వాయర్లను నిర్మాణం చేసుకున్నట్లు వివరించారు.



రోడ్‌షోలో మాట్లాడుతున్న కేటీఆర్

రూ. 450 కోట్లతో అభివృద్ధి..

నియోజకవర్గ వాసులకు కష్టమొస్తే పరిగెత్తుకుంటూ వచ్చి ఆదుకునే నాయకుడు పద్మారావు గౌడ్ అని మంత్రి కేటీఆర్ కొనియాడారు.రెండు మూడేళ్లలోనే మొత్తం రూ. 450 కోట్ల రూపాయలతో పద్మారావుగౌడ్ సారథ్యంలో ఎన్నో అభివృద్ధి పనులు చేసుకున్నామన్నారు. పద్మారావుగౌడ్ లాంటి నాయకులు ఎమ్మెల్యేగా ఉండడం సికింద్రాబాద్ ప్రజల అదృష్టమన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత గత తొమ్మిదిన్నర సంవత్సరాలలో కులం పేరుతో కుంపట్లు లేవు, మతం పేరుతో మంటలు లేవు, ప్రాంతం పేరుమీద పంచాయతీలు లేవన్నారు. హైదరాబాద్‌లో ఉండే వారు ఎవరైనా తెలంగాణ బిడ్డలేనని ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైనప్పుడే అనుకున్నామని, అప్పటినుంచి అభివృద్ధే మా కులం, సంక్షేమమే మా మతం అనుకుంటూ ముందుకు వెళ్తున్నామని అందుకే కర్ఫ్యూలు, కాల్పులు, కత్తిపోట్లు, అల్లర్లు, అలజడులు, హిందూ ముస్లి పంచాయతీలు లేవని వెల్లడించారు. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ప్రతీ ఇంట్లో, కంపెనీల్లో ఇన్వర్టర్లు, జెన్‌రేటర్లు ఉండేవని, ప్రస్తుతం విద్యుత్ సమస్య తొలగిపోయిందని, తాగునీటి సమస్య తీరింది, శాంతి భద్రతలు బాగున్నాయన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలోని అన్ని ముఖ్యమైన డివిజన్లకు మెట్రోను తీసుకువచ్చే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు.కేసీఆర్‌ను ఢీ కొట్టేందుకు ఢిల్లీ నుంచి పెద్ద పెద్ద నాయకులు రాష్ట్రానికి వస్తున్నారని, ఢిల్లీ మెడలు వంచి తెలంగాణ తీసుకొచ్చిన కేసీఆర్‌ను ఢీ కొట్టే దమ్ము ఎవ్వరికీ లేదన్నారు.



తెలంగాణలో స్నేహపూర్వక వాతావరణం

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతనే అన్ని ప్రాంతాల వారు స్నేహపూర్వకంగా ఉంటూ కలిసికట్టుగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసుకోవడం జరుగుతుందని బీఆర్‌ఎస్ సనత్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ స్పష్టం చేశారు. ఎస్‌ఆర్‌నగర్ కమ్మవారి సేవా సమితి కార్తీక మాస వనభోజనాలు శనివారం మోడల్‌కాలనీ కమ్యూనిటీ హాల్‌లో సందడిగా జరిగాయి. ఈ కార్యక్రమానికి హాజరైన తలసాని మాట్లాడుతూ.. గడిచిన తొమ్మిదిన్నర సంవత్సరాలుగా జీహెచ్‌ఎంసీ ఎంతో వేగంగా అభివృద్ధి జరిగిందన్నారు. నియోజకవర్గం విషయంలో తాను వహించిన శ్రద్ధ ఎవరూ వహించలేదన్నారు. 2014కు ముందు ఎలా ఉండేదో.. 2014 తర్వాత ఎలా ఉందో గ్రహించాలన్నారు. 24 గంటల పాటు విద్యుత్, మంచి నీరు, గ్రీనరీ, రోడ్ల కనెక్టివిటీ, లింక్ రోడ్లు, అండర్‌పాస్, ఫ్లైఓవర్లు, ఎల్‌ఈడీ లైట్లు..ఇలా అన్ని సౌకర్యాలను కల్పించుకోవడం జరిగిందన్నారు. కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, ఎస్‌ఆర్‌నగర్ కమ్మవారి సేవా సమితి ప్రతినిధులు కొత్తపల్లి మధుసూదన్ రావు, రాజారావు, నరేందర్, సుబ్బయ్యలతో పాటు లక్ష్మణరావు, బుచ్చిబాబు, డాక్టర్ వైవీ రాఘవయ్య, సురేష్‌చౌదరి, శ్రీహరి, జేఎస్‌టీ శాయి పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీలను నమ్మడం లేదు..

సనత్‌నగర్: కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మడం లేదని, తిరిగి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద న్యూబోయిగూడకు చెందిన ఆకాష్ ఆధ్వర్యంలో పలువురు బీజేపీ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరగాలని ప్రజలు కోరుకుంటున్నారని, అది బీఆర్‌ఎస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి, గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, వెంకటేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



బన్సీలాల్‌పేట్: పేదల సొంతింటి కలను నిజం చేసిన ఘనత బీఆర్‌ఎస్‌దే అని తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ పొట్టి శ్రీరాములు నగర్, జీవై కంపౌండ్, గాంధీనగర్, సోమప్పమఠం, అరుణ్‌జ్యోతి కాలనీ, దేవీనగర్ కాలనీ, సీసీనగర్ ప్రాంతాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ సాధించడం ఖాయమన్నారు.

బీఆర్‌ఎస్‌కు మద్దతివ్వండి ..

పద్మారావునగర్: ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రభాగానా నిలుపుతున్న బీఆర్‌ఎస్ పార్టీకి మరోమారు ప్రజలు మద్దతు ఇవ్వాలని తలసాని శ్రీనివాస్‌యాదవ్ వ్యాపారస్తులకు విజ్ఞప్తి చేశారు. తలసాని సాయి కిరణ్ యాదవ్, అశోక్ జైన్, పర్సమాల్ రాంకా, యోగేష్, మనీస్ అగర్వాల్, జగదీష్ ప్రసాద్, గులాబ్ సింగ్ పాల్గొన్నారు.



దీపావళి సమ్మేళనంలో మాట్లాడుతున్న శ్రీనివాస్ యాదవ్

అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

సనత్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి కోట నీలిమ



మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి, పక్కన కోట నీలిమ

సనత్‌నగర్: అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యమని, ఉద్యోగాల భర్తీ, యువతకు ఉపాధి కల్పనలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని సనత్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి కోట నీలిమ విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆమె సనత్‌నగర్ డివిజన్ ఎస్‌ఆర్‌టీ కాలనీలో ఇంటింటి పాదయాత్ర నిర్వహించారు. బీఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ కార్యకర్తలకే సంక్షేమ పథకాలు అన్నట్లుగా పరిస్థితి తయారైందన్నారు. ముఖ్యంగా బీఆర్‌ఎస్ పాలనలో నిరుద్యోగులు దగా పడ్డారన్నారు. ఉన్నత చదువులు చదివి కూడా నిరుద్యోగులుగా అవస్థలు పడుతున్నా ఉద్యోగాల భర్తీ చేయకపోవడం బాధాకరమన్నారు. ఉద్యోగ ప్రకటన తేదీలను ముందే ప్రకటించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగాల భర్తీ జరుగుతోందన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమాన్ని అందించేలా ఉందన్నారు. ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి మేనిఫెస్టోలో పెద్దపీట వేసినట్లు ప్రకటించారు. మేనిఫెస్టో కమిటీ సభ్యురాలిగా తాను అనేక సూచనలు తెలిపినట్లు తెలిపారు. నగరం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికను మేనిఫెస్టోలో పొందుపరిచినట్లు తెలిపారు.

రాంగోపాల్‌పేట డివిజన్‌లో..

రాంగోపాల్‌పేట డివిజన్ అధ్యక్షుడు మల్లికార్జున్, సురేష్, ఉషాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో డాక్టర్ కోట నీలిమ హాజరై హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాల్సిందిగా అభ్యర్థించారు. అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యమని ఆ దిశగా మేనిఫెస్టోను రూపొందించడం జరిగిందన్నారు.

మిషన్ భగీరథ కాదు..కమీషన్ భగీరథ: కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి

సనత్‌నగర్: ప్రభుత్వం మిషన్ భగీరథ పేరిట కమిషన్ భగీరథ కార్యక్రమాన్ని చేపట్టారని కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి అన్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం సనత్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి కోట నీలిమతో కలిసి బల్కంపేట నుంచి సనత్‌నగర్ జెక్‌కాలనీ వరకు రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా రేణుకాచౌదరి మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రశ్నాపత్రాలనే కాపాడలేని వారు రాష్ట్రాన్ని ఎలా కాపాడతారని ప్రశ్నించారు. కూలిపోయే కాళేశ్వరంతో ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. తనకు ఓట్లు పడని ప్రాంతాల్లోని వారిని పంపించి వేస్తామని స్థానిక ప్రజాప్రతినిధి బెదిరిస్తున్నారని, తమను పంపించడానికి ఆయన ఎవరని అన్నారు. జెక్‌కాలనీకి ఖాళీ స్థలం, హాల్ కేటాయిస్తామని హామీనిచ్చారని, స్థానికులకు ఇబ్బందిగా మారిన ఆదివారం సంతను తరలిస్తామని చెప్పారన్నారు. ఆ హామీలను నెరవేర్చలేకపోయారన్నారు. అభ్యర్థి కోట నీలిమను గెలిపిస్తే ఆమె తనదైన విజన్‌తో సనత్‌నగర్‌ను అభివృద్ధి చేస్తోందన్నారు. రోడ్ షోలో డాక్టర్ రవీందర్‌గౌడ్, డాక్టర్ మల్లు ప్రసాద్, గంగాధర్‌గుప్తా, భాస్కర్, మాజీ కార్పొరేటర్లు కంజర్ల శ్రీనివాస్‌యాదవ్, ఆయూబ్‌ఖాన్, సీనియర్ నాయకులు ఐవన్‌వాజ్, అడ్డు, అజ్జు, ఆర్‌బీ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి బీఆర్‌ఎస్‌కు కాలం చెల్లింది

సనత్‌నగర్: బీఆర్‌ఎస్ పాలకుల అక్రమాలపై పోరాటం చేస్తూ నిత్యం ప్రజల సంక్షేమం కోసం ఆలోచించే తనను గెలిపిస్తే సనత్‌నగర్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని బీజేపీ అభ్యర్థి మర్రి శశిధర్‌రెడ్డి హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని పలు డివిజన్‌లలో శనివారం ఆయన ఇంటింటి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా మర్రి శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఢిల్లీ స్థాయిలో పదవులు చేపట్టినప్పటికి తన మొదటి ప్రాధాన్యత మాత్రం సనత్‌నగర్ నియోజకవర్గ ప్రజలకే ఇచ్చానన్నారు. సనత్‌నగర్ లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్‌లో స్టేడియం నిర్మాణాన్ని ఎలాంటి ముందస్తు ఆలోచన లేకుండా అక్కడి స్థలం మధ్యలో చేపట్టేందుకు బీఆర్‌ఎస్ పాలకులు పూనుకుంటే తాను స్థలం వృథా కాకుండా పీఎఫ్ స్థలంలో నిర్మాణం జరిగేలా పోరాడి సాధించడం జరిగిందని గుర్తుచేశారు. బేగంపేట పాటిగడ్డలో జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం ఇళ్ల నిర్మాణం పూర్తయ్యి పదేళ్లు గడిచినా ఇంతవరకు లబ్ధిదారులకు కేటాయించకపోవడం విచారకరమన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక ఆ ఇళ్లు లబ్ధిదారులకు కేటాయింపు జరిగేలా చూస్తానని హామీనిచ్చారు. నియోజకవర్గ సమస్యలపై తనకు పూర్తిస్థాయిలో అవగాహన ఉందని, గెలిపిస్తే ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు.



ఎన్నికల ప్రచారంలో మర్రి శశిధర్‌రెడ్డి

- జనసేన సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కావ్యాతో పాటు పలువురు నేతలు మర్రి శశిధర్‌రెడ్డికి మద్దతుగా నిలిచారు. రాజకీయాల్లో మచ్చలేని నాయకుడంటే మర్రి శశిధర్‌రెడ్డి అని, అలాంటి నేతను గెలిపించుకుంటామని తెలిపారు.

తల తెగినా బీజేపీతో కలిసే ప్రసక్తే లేదు

హోంమంత్రి మహమూద్ అలీ

కంటోన్మెంట్: బీఆర్‌ఎస్, బీజేపీతో ఎప్పటికీ కలవబోదని హోంమంత్రి మహమూద్ అలీ స్పష్టం చేశారు. తమ తల తెగినా బీజేపీతో కలిసే ప్రసక్తే లేదన్నారు. కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి లాస్య నందిత ఆధ్వర్యంలో బోయిన్‌పల్లిలోని తెలంగాణ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన మైనారిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణలో ముస్లింల అభ్యున్నతికి పాటుపడిన ఏకైక సీఎం కేసీఆర్ మాత్రమే అన్నారు. 2018లో ప్రభుత్వం ఏర్పాటయ్యాక సీఎంతో పాటు తాను ఒక్కడినే మంత్రివర్గంలో కొనసాగానని ముస్లింను డిప్యూటీ సీఎం చేసిన ఘనత ఆయనేదనన్నారు. 2014కు ముందు ఉమ్మడి రాష్ట్రంలో కేవలం 12 మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్ మాత్రమే ఉంటే, ఈ పదేళ్లలో 240 స్కూల్స్ ఏర్పాటు చేశామన్నారు.

రేవంత్ మూలాలు ఆర్‌ఎస్‌ఎస్‌లో..

కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆర్‌ఎస్‌ఎస్ మూలాలున్న వ్యక్తి అని అన్నారు. చిన్నతనంలో మన మనస్సులో నాటుకుపోయిన భావజాలమే జీవిత కాలం కొనసాగుతుందన్నారు. అందుకే రేవంత్ ఎప్పటికీ సెక్యులర్ కాలేడన్నారు. 20 సీట్లు కూడా గెలవలేని కాంగ్రెస్ నేతలు ఇప్పటికీ ముఖ్యమంత్రి పదవి కోసం పోటీలు పడుతూ ఉండటం హాస్యాస్పదంగా ఉందన్నారు. కంటోన్మెంట్‌లో సాయన్న కుమార్తె లాస్య నందితను భారీ మెజారిటీ గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెన్ శ్రీనివాస్, గజ్జెల నాగేశ్, మసీఉల్లా ఖాన్, నివేదిత, మహేశ్వర్ రెడ్డి, నళిని, అనిత ప్రభాకర్, టీఎన్ శ్రీనివాస్, హరి, నర్సింహ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మహమూద్ అలీ

బీఆర్‌ఎస్‌లోకి ప్రమోద్‌కుమార్



కేటీఆర్‌తో ప్రమోద్‌కుమార్

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి షాక్ తగిలింది. పార్టీ వరంగల్ జిల్లా ఇన్‌చార్జి, కంటోన్మెంట్ నియోజకవర్గం మాజీ అధ్యక్షులు, బి. ప్రమోద్‌కుమార్ పార్టీ నాయకులు శశిధరన్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి శనివారం ప్రగతి భవన్‌లో మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్ లో చేరారు. ప్రమోద్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు చూసి పార్టీలో చేరినట్లు చెప్పారు. కంటోన్మెంట్‌లో పార్టీ అభ్యర్థి లాస్యనందిత గెలుపునకు తనవంతుగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ ఖదీరవన్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

అమీర్‌పేట: అమీర్‌పేటకు చెందిన బీజేపీ నాయకులు మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి మంత్రి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ కండువా కప్పి ఆహ్వానించారు. శేఖర్, శ్రీనివాస్, అబ్దుల్ వాహిద్, రషీద్, వెంకట్ యాదవ్, నవీన్, నూతన్ పార్టీలో చేరారు.

అంతర్జాతీయ సింపోజియానికి రిజిస్ట్రేషన్లు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీలో డిసెంబరు 30, 31 తేదీల్లో జరిగే 2వ అంతర్జాతీయ సింపోజియం (ఐఎస్‌ఆర్‌సీఈ-2023) జరగనుంది. ఇంజినీరింగ్ పూర్వవిద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే సింపోజియానికి ఆసక్తి గల అభ్యర్థులు వచ్చే నెల 15 వరకు రిజిస్ట్రేషన్లను చేసుకోవాలని ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్ తెలిపారు. ఇంజినీరింగ్ యూజీ, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులతో పాటు ఫ్యాకల్టీ సభ్యులు, పూర్వ విద్యార్థులు, కార్పొరేట్ సంస్థల సిబ్బంది, ఇతరులు సింపోజియానికి హాజరుకావొచ్చన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి



సనత్‌నగర్: ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములుగా కావాలని కాలుష్య నియంత్రణ మండలి ప్రాజెక్ట్ ఆఫీసర్ సత్తయ్య పిలుపునిచ్చారు. కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ విద్యా విభాగం ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వ్యర్థాలపై శనివారం జ్ఞాన భారతి హైస్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ.. ప్లాస్టిక్‌కు బదులుగా స్టీల్, గాజు, మట్టి, కాగితంతో తయారుచేసిన వస్తువులను వినియోగించాలన్నారు. ప్లాస్టిక్ కవర్లు సముద్రంలోకి చేరి జలరాశులకు ముప్పు వాటిల్లుతుందని అందుకే ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.23, నల్లవంకాయ 13, పొడుగు వంకాయ 13, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 23, పందిరి బీర 23, క్యాబేజీ 13, క్యారెట్ 40, దొండ 18, గుండుబీన్స్ 60, గింజ చిక్కుడు 55, గోకర కాయ 35, కీర 28, దోసకాయ 15, బీట్‌రూట్ 25, ఉల్లిగడ్డ 40, ఆలుగడ్డ 21, చామగడ్డ 37, మొరంగడ్డ 21, కందగడ్డ 50, సొరకాయ 9, పొట్లకాయ 13, అరటికాయ 9, మునగకాయ 4-6.

బీఆర్‌ఎస్‌కు గుణపాఠం తప్పదు

లాలాపేట: అవినీతి బీఆర్‌ఎస్ పాలనకు చరమగీతం పాడి తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం బీజేపీ ప్రభుత్వాన్ని తీసుకురావాల్సిన సమయం ఆసన్నమైందని మాజీ మేయర్ బండా కార్తీకరెడ్డి అన్నారు. తార్నాకలోని నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె, అభ్యర్థి మేకల సారంగపాణితో కలిసి మాట్లాడారు. అడ్డగుట్ట, బౌద్ధనగర్‌ను దత్తత తీసుకున్న సీఎం కేసీఆర్ వాటి అభివృద్ధిని విస్మరించారని ఈ సారి ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కేసీఆర్, కేటీఆర్ మాటలు ప్రజలు నమ్మే రోజులు పోయానని కుటుంబ పాలనను అంతమొందించడం ఖాయమన్నారు. సికింద్రాబాద్ గడ్డపై బీజేపీ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నాగేశ్వర్‌రెడ్డి, వీరన్న, హరి, పోచయ్యయాదవ్ పాల్గొన్నారు.

అవకాశమివ్వండి.. అవినీతి లేని పాలన అందిస్తా

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో బీజేపీకి అవకాశం ఇస్తే అవినీతి లేని పాలన అందిస్తామని ఆ పార్టీ అభ్యర్థి శ్రీగణేశ్ నారాయణ్ అన్నారు. శనివారం మారేడుపల్లిలో ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటోన్మెంట్‌లో రాష్ట్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపికలో భారీ అవినీతి జరగడం దారుణమన్నారు. డబుల్ బెడ్రూమ్ కేటాయింపు, దళిత, బీసీ, మైనారిటీ బంధు, గృహలక్ష్మీ ఇలా ఏ పథకాన్ని తీసుకున్నా అన్నింటా అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాని ఆరోపించారు. ముఖ్యంగా మారేడుపల్లి, మడ్‌ఫోర్ట్‌లో రెండేళ్ల క్రితం డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణం పూర్తయినా లబ్ధిదారులకు ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. కొన్ని ఇళ్లను ఏకంగా మాజీ ఎమ్మెల్యే కుటుంబ సభ్యులే అమ్ముకునే ప్రయత్నాలు చేసినట్లు ఆరోపించారు. బాధితుల పక్షాన నిలబడి బీజేపీ తరఫున తాము పోరాడుతామన్నారు.

ఉపాధి కల్పనలో టెక్స్ అకాడమీ ముందంజ

రాంగోపాల్‌పేట్: విద్యార్థులకు అత్యుత్తమ శిక్షణతో పాటు ఉపాధి కల్పించి ఉన్నత శిఖరాలను చేర్చడంలో టెక్స్ అకాడమీ ముందుందని సంస్థ ఎండీ జహీరుద్దీన్ అన్నారు. ఎస్డీరోడ్‌లోని అమ్‌శ్రీ ఫాస్ట్ బిల్డింగ్‌లో టెక్స్ అకాడమీ నూతన బ్రాంచ్‌ను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రాడ్యుయేట్స్‌కు గత కొన్ని ఏళ్ల నుంచి ఐటీ కోర్సుల్లో శిక్షణ అందించి సుమారు 6 వేల మందికి ఉపాధి కల్పించామన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కూడా శిక్షణ అందించాలనే ఉద్దేశంతో ఆన్‌లైన్‌లో అందిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకు ముందుగా కెరీర్ గైడెన్స్ అందించి వారికి సరిపడే కోర్సులకు ముందస్తు కౌన్సెలింగ్ నిర్వహించి శిక్షణ తర్వాత నెల రోజులు ఐటీ సంస్థలో పనిచేయించి కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్ అందించి ఉపాధి కూడా కల్పిస్తామన్నారు. కోర్సు చేసేందుకు వచ్చే వారికి ముందస్తు స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహించి మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందిస్తామన్నారు. నగరంలోని హైటెక్‌సిటీ, కూకట్‌పల్లి, దిల్‌సుఖ్‌నగర్, అమీర్‌పేట్‌లో బ్రాంచ్‌లు కొనసాగుతున్నాయని ఐదవ బ్రాంచ్ సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ రఘువంశీ, రీజనల్ మేనేజర్ ప్రతాప్, మార్కెటింగ్ మేనేజర్ భాస్కర్ పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఢిల్లీలో డిసెంబరు 7 నుంచి 10 వరకు జరిగే ఏబీవీపీ 69వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ తెలిపారు. శనివారం రాష్ట్ర కార్యాలయంలో మహాసభల విజయవంతం కోసం రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. విలేకరుల సమావేశం ఆమె మాట్లాడారు. 75 ఏళ్ల ఏబీవీపీ అమృతోత్సవంలో భాగంగా దేశ రాజధాని ఢిల్లీలోని డీడీఏ గ్రౌండ్స్‌లో మహా సభలను నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఆకట్టుకున్న యురేకా సైన్స్ ఫెయిర్

అమీర్‌పేట: ఎస్‌ఆర్‌నగర్‌లోని అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన యురేకా సైన్స్ ఫెయిర్ ఆకట్టుకుంది. విద్యార్థులు రూపొందించిన నమూనాలను ప్రదర్శించి వాటి ప్రత్యేకతను వివరించారు. రోబోటిక్స్, ఎక్స్ క్యూ వీడియో ల్యాబ్, ఆర్ట్ గ్యాలరీ, సైన్స్ ల్యాబ్, ఆయూష్మాన్ భవ పేరుతో ఆయుర్వేద ఆశ్రమం వంటివి సందర్శకులను ఆకట్టుకున్నాయి. బచ్‌పన్, అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ జాతీయ ప్రతినిధి గిరీష్ మక్వానా, డైరెక్టర్ మురళీధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నీరజ్ కక్కర్ విద్యార్థులను అభినందించారు.పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యతను వెలికి తీసేందుకు ఇలాంటి ప్రదర్శనలు ఎంతో ఉపయోగపడతాయన్నారు.

రోడ్‌షోకు తరలిన బీఆర్‌ఎస్ శ్రేణులు

లాలాపేట: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం సికింద్రాబాద్ నియోజకవర్గంలోని అడ్డగుట్ట, సీతాఫల్‌మండి ప్రాంతాల్లో నిర్వహించిన మంత్రి కేటీఆర్ రోడ్‌షోకు తార్నాక డివిజన్ లాలాపేట నుంచి భారీ సంఖ్యలో బీఆర్‌ఎస్ శ్రేణులు తరలివెళ్లారు. పద్మారావు తనయుడు త్రినేత్ర గౌడ్, నాయకులు రాజేష్ వైష్ణవ్ పాల్గొన్నారు.

శిలాఫలకాల్లోనే అభివృద్ధి పనులు!

- రూ. కోట్లలో ఖర్చుచేసి భూమి పూజలకే పరిమితం
- అర్ధంతరంగా కొన్ని, ముందుకు కదలని మరికొన్ని పనులు

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పాలనలో కోట్లాది రూపాయల వ్యయంతో చేపట్టే పలు అభివృద్ధి పనులు శిలాఫలకాలు, భూమి పూజలకే పరిమితమయ్యాయి. గత నాలుగున్నర ఏళ్ల క్రితం ఎమ్మెల్యే, పాటు బోర్డు మాజీ సభ్యులు కలిసి పలు అభివృద్ధి పనులకు హడావిడిగా శంకుస్థాపనలు చేసి చేతులు దులుపుకున్నారనే ఆరోపణలున్నాయి. కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, భూగర్భ డ్రైనేజీ పైపులైన్లు, బీటీ రోడ్లు పనులకు శ్రీకారం చుట్టి, ఆ తర్వాత వాటిపై దృష్టి సారించకపోవడంతో అర్ధంతరంగా నిలిచిపోయాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మొండి గోడలతో కమ్యూనిటీ భవనాలు..

సిక్ విలేజ్ బేరర్స్ లైన్‌లో రూ.10 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరించారు. అదే విధంగా ఈద్గా అంబేడ్కర్‌నగర్, కార్ఖాన చర్చిగల్లి కమ్యూనిటీహాళ్ల నిర్మాణానికి సైతం భూమి పూజ చేశారు. ఏళ్లు గడచినా ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు. రూ.45 లక్షల వ్యయంతో రెండవ వార్డు కృష్ణనగర్ కట్టమైసమ్మ బస్తీలో కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులు నిధులు లేక అసంపూర్తిగా ఉండి నిరూపయోగంగా మారింది. ఇదే తరహాలో మూడవ వార్డు వెంకటరమణ కాలనీ, కార్ఖాన ఈద్గా ఎదురుగా, బొల్లారం తోటి సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు సైతం అసంపూర్తిగా ఉండి పిచ్చిమొక్కలు మొలిచాయి. ఇక కార్ఖాన లోని ప్రభుత్వ పాఠశాల నుంచి గణేష్ టెంపుల్ వరకు రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి వదిలేశారు.



అర్ధంతరంగా నిలిచిన కమ్యూనిటీ హాల్ పనులు

అటకెక్కిన హామీలు..

చిన్నకమేళాలో కమ్యూనిటీహాల్, బాలంరాయిలో శిథిలావస్థకు చేరిన సామూహిక మరుగుదొడ్లను తొలగించి ఆ స్థలంలో మినీ ఫంక్షన్‌హాల్ నిర్మాణం, బాలంరాయి చెక్‌పోస్టు సమీపంలో చిల్డ్రన్స్‌పార్క్ అభివృద్ధి, పలు బస్తీల్లో యూజీడీ పైపులైన్ల వ్యవస్థ తాగునీటి పైపులైన్ల ఏర్పాటు, తదితర అభివృద్ధి పనుల విషయంలో నాటి ఎమ్మెల్యే, బోర్డు మాజీ సభ్యులు హామీలిచ్చి నిర్లక్ష్యం చేశారని ఆయా ప్రాంతాల అసహనం వ్యక్తం చేస్తున్నారు. పనులు చేపట్టలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.